## కథ

**'కర్నూలు వెళ్ళే దారిలో బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో ముప్పైమంది దుర్మరణం'**

**'మరో ముగ్గురు ప్రత్తి రైతుల ఆత్మహత్య'**

**'ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య'**

**'ముగ్గురు పిల్లలతో సహా భార్యాభర్తలు అప్పుల బాధ భరించలేక, తిరుమలలో పురుగుల మందు సేవించి మృతి'**

# తరాలు - అంతరాలు

ఓ చేతిలో కాఫీ కప్పుని, మరో చేతిలో సిగరెట్‌ని అలవోకగా పట్టుకుని, ఒళ్ళో వున్న పేపర్‌లో ఆనాటి వార్తల్ని ఇంట్లోవాళ్ళందరికీ విన్పించేలా చదువుతున్నాడు వేణు. టి.వి.లో రంగోలీ చూస్తూ మధ్య మధ్య నాన్న మాటల్ని ఆలకిస్తున్నారు పిల్లలు. గోరుచిక్కుళ్ళు పీచు తీస్తూ కొడుకు చదివే వార్తల్ని శ్రద్ధగా ఆలకిస్తోంది అఖిల.

''అబ్బబ్బ! ఏవిటండీ! ఆదివారం ప్రొద్దున్నే మొదలుపెట్టారు చావుల పురాణం. ఆ పేపర్లో, అవి తప్ప మరే వార్తా లేదా!'' విసుగ్గా అంది వినీల వంటగదిలోంచే.

''అహ! ఎందుకు లేవూ! ఈరోజు రాత్రికే మిస్ వరల్డ్ పోటీలు లండన్‌లో...పధ్నాలుగేళ్ళ కుర్రహీరోతో తీసిన సినిమా తాలూకు విజయోత్సవం...కేవలం పాతికవేల రూపాయలకే పదారేళ్ళ పడుచుల్లా తయారవండి, రెండు లేక మూడు సిట్టింగులు. అంతే. బ్యూటీ సెంటర్ ప్రకటన...ఇంకా చాలా వున్నాయ్ చదవమంటావా!'' సిగార్ నుసిని కిటికీలోంచి విదిలిస్తూ అన్నాడు వేణు.

''అబ్బాయ్! ఆ రైతుల చావుకి కారణం పంట నష్టమేనంటావా!'' అఖిల గొంతులో బాధ స్పష్టంగా విన్పిస్తోంది.

''మరేముంటుందమ్మా! వాణిజ్య పంట గదా అని, వున్నదంతా తెగనమ్మి, అప్పులు చేసి తిండి గింజలకి బదులు పత్తి సేద్యం చేసేసరికి, పురుగులు పట్టిన పంట తప్ప పైసా మిగిలుండదు. ఒకళ్ళా, ఇద్దరా, వందల్లో వున్నయ్యి ఈ రకం ఆత్మహత్యలు.''

''హు! ఒకప్పుడు అనేవాళ్ళు మనిషిని నమ్మితే ఏముందిరా, మట్టిని నమ్మితే ఫలితముందిరా అని. ప్చ్ ఆ మట్టి కూడా నట్టేట్లో ముంచుతోంది. నిండు జీవితాల్ని బలి కోరుతోంది'' బాధగా అంది అఖిల.

''అందుకే చెప్పానమ్మా నీకు, ఊళ్ళో వున్న ఆ కాస్తా అమ్మి పారేసి, మా దగ్గరే హాయిగా వుండమ్మా అని. నువ్వు వినవు. ఒక్కత్తివి ఆ పల్లెటూళ్ళో పడివుంటావు. మా జీతాల ముందు, ఆ పంట మీదొచ్చే ఆదాయం ఎంత చెప్పు? అనవసరంగా శ్రమ నీకు ఈ వయసులో. నువ్వు ఊ..అను. క్షణాలమీద, ఆ ఇల్లు, పొలమూ అమ్మిపారేస్తాను. శుభ్రంగా ఇక్కడే వుందువు''

భర్త మాటలని కాస్త సవరించింది వినీల, వంటగదిలో పని ఆపేసి వచ్చి. ''అదే అత్తయ్యా! ఆ వచ్చిన సొమ్ముని ముగ్గురు కొడుకులకీ పంచేసి, తలా ఒకళ్ళింట్లో నాలుగు నెలలుంటే, ఏముందీ, ఏడాది ఇట్టే గడిచిపోతుంది. కదండీ''

తను పూర్తిగా తమ దగ్గిరే వుండిపోతుందేమో అన్న వినీల భయాన్ని గమనించి, మనసులోనే చిన్నగా నవ్వుకుంది అఖిల.

''నేనున్నన్నాళ్ళూ ఆ కాస్తా వుండనీరా! నాకూ ఈ ఇరుకు ఇళ్ళల్లో, ఊపిరి ఆడనట్లుగా వుంది. ఏదో కాళ్ళూ, చేతులూ ఆడుతున్నన్నాళ్ళూ అక్కడే నా సొంత వూళ్ళో బతకనీ'' నెమ్మదిగానే అన్నా నిశ్చయంగా అంది అఖిల.

''ఆవిడ వినరులెండి. ఎందుకొచ్చిన కంఠశోష?'' విసుగ్గా అంటూ పీచుతీసిన చిక్కుడుకాయల్ని వంటగదిలోకి తీసుకుపోయింది వినీల.

అన్ని విషాద వార్తలు చదివినా, ఏ ఒక్కదానికీ బాధగా స్పందించని కొడుకుని చూసి విస్తుబోయింది అఖిల. ఎవరూ, పండంటి జీవితాన్ని ఉత్తినే బలి చేసుకోరు కదా! పరిష్కారం లేని సమస్యల్ని వదిలించుకోవడానికి తేలిక మార్గంగా చావుని ఎంచుకుంటున్నారు. ఆదుకునేవారు లేక, రెక్కలు ముక్కలు చేసుకున్నా ఫలితం లేక, అతివృష్టి కాకపోతే అనావృష్టికి బలైపోయి తమకు తాము కొరివి పెట్టుకుంటున్నారు అన్నదాతలు. ఫ్యాషన్ షోలకీ, డాగ్ షోలకీ కోట్లు ఖర్చుపెడుతోంది ప్రభుత్వం. మోడ్రన్ దుస్తులకీ, రాంప్ డాన్సులకి లక్షలు పోస్తున్నారు వున్నవాళ్ళు. రూపాయి విలువుండే సరుకుని పది పైసలకి కొని పది రూపాయలకి అమ్మి మిద్దెలమీద మిద్దెలు కడుతున్నారు కంట్రాక్టర్లు. నోట కొట్టిన మట్టిని మింగలేక, క్రక్కలేక, కన్పించని జీవితమార్గాన్ని, కనిపించే చావులో వెతుక్కుంటున్నారు అభాగ్యులు. ఎవరికి వారే యమునా తీరే. చిన్నినా పొట్టకు శ్రీరామరక్ష. ఎంత మోడ్రన్ జీవనమైనా, అంత స్వార్థంగా వుండనక్కరలేదు. అయ్యోపాపం అనే అంతరంగమే లేనినాడు మనిషికీ పశువుకీ తేడా లేదు. ఉగ్గుపాలతో తను నేర్పిన కథల్లోని కారుణ్యం, కొడుకుకు ఎందుకు అంటలేదా అనిపించింది అఖిలకి.

★ ★ ★

పక్క ఫ్లాట్‌లోంచీ సన్నగా ఏడుపు విన్పించడంతో కారణం ఏమయివుంటుందా అని ఆలోచించసాగాడు వేణు. ఆ ఇంటాయన ఇంజనీరు, భార్య కూడా ఉద్యోగం చేస్తుంది. ఇద్దరూ వయసులో పెద్దవాళ్ళే. పిల్లలిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. ఇంజనీరుగారి తండ్రి, ఇటీవలే వైద్యం కోసం వచ్చాడు కొడుకు దగ్గరకి.

''ఎవరో ఏడుస్తున్నట్లున్నారు. చూసి రారా వేణూ!'' అంది అఖిల.

వెళ్ళిన పది నిమిషాలలో తిరిగి వచ్చాడు వేణు.

''పక్కింటి ఇంజనీరుగారి తండ్రి పోయారట్ట అమ్మా! ఇదిగో వినీలా! విన్నావా! రాత్రి బాగానే పడుకున్నారట్ట. అందరూ ఇంకా నిద్రపోతున్నాడేమోలే అని వూరుకున్నార్ట. ఇప్పుడు చూస్తే ఒళ్ళు చల్లగా తగిలేసరికి భయం వేసి డాక్టర్‌కి ఫోన్ చేసి పిలిపిస్తే, ఆయన వచ్చి ప్రాణం పోయి నాలుగ్గంటలు అయింది అన్నారట్ట'' వివరాలు చెప్పాడు.

''ఇంత జరిగినా మనకి తెలీలేదు చూడు. ఏం నగరాలో! ఏం మనుషులో!''

అఖిల వ్యాఖ్యకి అడ్డం వచ్చింది వినీల.

''అదే మంచిదిలే అత్తయ్యా! తెలిసి మనం ఏం చేస్తాం? పోయినవాణ్ణి తిరిగి తేగలమా ఏమన్నానా!'' టిఫిన్ ప్లేట్స్ టేబిల్ పైన సర్దుతూ అంది.

''ఇప్పుడు టిఫిన్లేంటి వినీలా! వాళ్ళకి కాస్త తోడుగా వుందాం. పదరా వేణూ! రండ్రా పిల్లలూ'' సిరి చెయ్యి పట్టుకుని గుమ్మం దాటిపోయిన అత్తగారిని ఆపింది వినీల.


''భలేవాళ్ళే అత్తయ్యా మీరు! పిల్లలు భయపడరూ! మరీ ఛాదస్తంగా వున్నారే. ఇప్పుడు మీరందరూ వెళ్ళి చేసేదేమిటట?''

''మనిషికి మనిషి తోడు..మనసుకి మాట తోడు. పక్కింట్లో మనిషి పోతే, పట్టనట్లు కూచోడం ఏం సంస్కారం. తర్వాత జరిగే, జరగాల్సిన కార్యక్రమాలకి వాళ్ళవాళ్ళు వచ్చేవరకూ సాయపడటం మన బాధ్యత కాదూ!'' ఆశ్చ

ర్యంగా అంది అఖిల.

''గాడిదగుడ్డు కాదూ!'' మూతి మూడు వంకర్లు తిప్పింది వినీల.

''అదికాదమ్మా! వాళ్ళ వ్యవహారాల్లోకి మన మెందుకు తలదూర్చడం? అనవసర బాధ్య తలూ, ఖర్చులూ మనమీద పడ్తాయి. మన పల్లె ల్లోలాగా వుండదమ్మా ఇక్కడి జీవితం. ఎవరి కష్టాలు వాళ్ళవి. ఎవరికి వాళ్ళే పరిష్కరించుకో వాలి'' స్థిరంగా అన్నాడు వేణు, వంటగదిలోకి వెళ్తూ.



భారంగా అయింది అఖిల మనసు. సాయం కాదు, సానుభూతిని కూడా లాభనష్టాల పరంగా ఆలోచిస్తున్న నేటితరం గురించి ఆందోళనతో మూలిగింది ఆవిడ మనసు.

''అమ్మా! అందరం కలిసి అలా బయట తిరిగి వద్దాం ఈరోజు. భోజనం కూడా బయటే చేద్దాం'' భార్యతో చర్చించిన కాసేపటికి బయటికి వచ్చి తల్లితో అన్నాడు వేణు.

పిసరంత కూడా మానవత్వం లేని తనవాళ్ళ మీద రోత కల్గింది అఖిలకి.

''నాకు ఓపిక లేదురా! నేను రాను. మీరు వెళ్ళి రండి'' చెప్పింది అఖిల.

ఆ జవాబునే ఆశించిందేమో వినీల, తన ముఖంలో ఒకింత ఆనందం కన్పించింది.

''నేను రానమ్మా! బంటీని తీసికెళ్ళండి. బోలెడు రైటింగ్ వర్క్ వుంది నాకు'' చెప్పింది సిరి.

''పిచ్చిముఖమా! ఇంకాసేపటికల్లా పక్కింటా యన చుట్టాలందరి ఏడుపులూ, గగ్గోలులూ వింటూ కూర్చోవాల్సొస్తుంది. భయపడతావ్. రాత్రికి చేద్దువులే హోం వర్క్'' అనునయించబోయిన తల్లిని కాదని, ''ప్లీజ్! డోంట్ ఫోర్స్ మీ. నేను రాను'' స్థిరంగా అంది సిరి.

''దిస్ ఓల్డ్ లేడీ ఈజ్ ఇన్ఫ్లూయెన్సింగ్ హర్'' అత్తగారిని వుద్దేశించి అంది వినీల భర్తతో.

''ఐ నెవర్ ట్రై టు డూ సచ్ థింగ్ వినీలా. ఇట్ ఈజ్ యువర్ లైఫ్. ఐ విల్‌నాట్ ఇన్‌ట్రూడ్''

అఖిల మాటలకి ఖంగుతిన్నది వినీల. ఆవిడకి అర్థం కాకూడదని ఇంగ్లీష్‌లో అన్నదే కానీ అత్త గారు పియుసి దాకా చదివిందనీ, ఇప్పటికీ పేపర్లకి ఆర్టికల్స్ పంపుతూంటుందనీ మర్చిపోయింది. వంచిన తల ఎత్తకుండానే 'సారీ' చెప్పి లోపలికి వెళ్ళిపోయింది.

★ ★ ★

వేణు వాళ్ళు వెళ్ళిపోయాక, తనతో వస్తానన్న సిరిని కూడా వెంట దీసుకుని పక్క ఫ్లాట్‌కి వెళ్ళింది అఖిల. పోయిన వ్యక్తితో తనకున్నది కాస్త పరిచయమే అయినా, దానినే గుర్తు చేసుకుని వాళ్ళకి ధైర్య వచనాలు చెప్పింది. మధ్యాహ్నం రెండింటికల్లా అంత్యక్రియలు జరగటం, అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసుకుని మగవాళ్ళు రావడం జరిగాక, ఆ ఇంట్లోవాళ్ళకి తనూ సాయం చేసి వంట పూర్తయ్యాక వడ్డించి మరీ వచ్చింది. నాయనమ్మ వైఖరి చాలా ఆశ్చర్యంగా వుంది సిరికి.

''రావే సిరీ! మనమూ అన్నం తినేద్దాం'' అన్నం వండి, కాస్త చారూ, కూరా మాత్రమే చేసింది అఖిల.

''నానమ్మా! వాళ్ళు తినేవరకూ, మనం కూడా భోం చేయకూడదా'' అడిగింది సిరి, అన్నం కలుపుకుంటూ.

''కూడదు అని ఎక్కడా లేదమ్మా. అవతలవాళ్ళు బాధపడుతూంటే, మనం హాయిగా వుండగలగడం ఎలా సాధ్యం? నిన్నటి దాకా మనతోపాటు నడయాడిన వ్యక్తి రేపటి నుంచి కనిపించడు అన్న బాధ కలగదూ! కాలం మారిపోయిందిలే. మనుషులూ మారిపోయారు'' విషాదంగా అంది అఖిల.

''మీ తాతయ్య పోయినప్పుడు, ఉన్న ముగ్గురు పిల్లల్లో ఏ ఒక్కరూ దగ్గర లేరు. మీ చిన్నాన్నకి ఫోను లేకపోవటంతో సమాచారం అంది, వాడు వచ్చేసరికి అర్ధరాత్రి దాటింది. అప్పటివరకూ వూరు వూరంతా శవంతోపాటే వుండిపోయారు. ఏ ఒక్కరి ఇంట్లోనూ పొయ్యిలో పిల్లి లేవలేదు. శవజాగరణ చేశారందరూ. మర్నాడు జరగాల్సినవన్నీ జరిగాకే ఇంటికి మరలారు. ఏం! వాళ్ళు వుండి మీ తాతగార్ని ప్రాణాలతో తేగలిగారా! లేదే! నన్ను ఒంటరిగా మీ తాతగారి వద్ద వదిలి, వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోవచ్చుగా! ఒకరి కోసం ఒకరం బ్రతకకపోతే సమాజం సజావుగా నడవదమ్మా. మనిషి సంఘజీవి. ఆ విషయం మనదాకా వస్తేగానీ ఎవరికీ అవగతం కాదు'' నిట్టూర్చింది అఖిల.

''అంతేనేమో!'' అనుకుంది ఇంకా స్వార్థం వాసనలు తగలని సిరి.

★ ★ ★

**పద్మలతా జయరాం**

''మబ్బులు ముసురుతున్నాయ్ సిరీ! వానొస్తుందేమో! పైన మేడమీద మీ అమ్మ దుప్పట్లు ఆరేసింది. తడిసిపోతాయేమో తీసుకురావే'' కిటికీలోంచి చూసింది అఖిల నల్లమబ్బుల్ని.

''నువ్వూ రా నానమ్మా. మా మేడ మీదికి నువ్వెప్పుడూ ఎక్కలేదుగా! అయిదంతస్థుల పైనుంచి సిటీ వ్యూ చాలా బాగుంటుంది''

## మనీషా భయం

**సినిమా తారలనుంచి సాధారణ మనుషుల వరకూ అందరికీ కొన్ని భయాలుంటాయి. ఏక్ చోటీసీ లవ్ స్టోరీ తరువాత మనీషా జీవితంలో ఎన్నో మార్పులొచ్చాయి. 'పైసా వసూల్'తో సినిమా నిర్మాణాన్ని చేపట్టిన మనీషాకి ఆ సినిమా ఎన్నో అనుభవాల్ని తెచ్చిపెట్టింది. నిత్యం షూటింగ్‌లు, చెక్కులపై సంతకాలు ఆమెని టెన్షన్‌కి గురిచేశాయంటోంది. 'సినిమా నిర్మాణం కన్నా నటించడమే సులభం' అంటున్న మనీషాకి సినిమా నిర్మాణం డెలివరీ లాంటిదంటోంది.**

నాయనమ్మతో సహా పైకి వచ్చింది సిరి.

కరిమబ్బుల చాటున కప్పబడిపోయిన సూర్యుడు తన కాంతిని వాటి అంచుల్ని చొచ్చుకుని మరీ ప్రసరింపజేస్తున్నాడు. బంగారు జరీతో బూడిదరంగు చీరకట్టినట్లుంది ఆకాశం. జలజల పారే సెలయేరులా సాగిపోతున్నాయ్ నేల మీది వాహనాలు. ఒకదాన్నొకటి ఒకటి బిరుసుకుపోయివున్న అపార్ట్‌మెంట్ల నడుమ దిష్టిబొమ్మల్లా వున్నాయి గుడిసెలు. కలవారింట్లో చిరుగుల చీర కట్టిన పనిమనిషిలా అనిపిస్తోంది ఆ దృశ్యం, అఖిలకి.

ఇంతలో కెవ్వుమన్న కేకతో చటుక్కున ఇటు తిరిగింది అఖిల.

చేతికి అంటుకుని వున్న ఇనప చువ్వతోసహా వ్రేలాడుతున్న కరెంటు వైరు. చువ్వతోసహా డాబా గచ్చు మీద పడ్డ సిరి.

జరిగిందేమిటో ఓ క్షణం పాటు ఆవిడకి అర్థం కాలేదు. నాలుగో అంతస్థులోని అపార్ట్‌మెంట్ సన్ షేడ్ మీద పడ్డ దుప్పటిని అందుకోవడానికి సిరి వుపయోగించిన ఇనపచువ్వ కరెంటు వైరుకి తగలడం, సన్నటి చినుకులకి తడిసిన వైరులోంచి ప్రసరించిన ఎలక్ట్రిసిటీ వల్ల సిరికి షాక్ తగలడం గ్రహించింది. వెంటనే ప్రక్కనే పడి వున్న కర్రతో చువ్వని తొలగించి, నల్లగా మారిపోతున్న సిరిని పట్టుకుని, గొంతులోని నరాలు బద్దలయ్యేటట్లు కేకలు పెట్టింది అఖిల. నిమిషాల్లో ఫ్లాట్స్‌లో వుండే చాలామంది పోగయ్యారు.

అందరూ తలోరకంగా మాట్లాడుతున్నారు.

''ముందు ఆ పిల్లని హాస్పటలకి తీసికెళ్ళాలి. జరగండి అందరూ'' ఎవరో అన్నారు.

''ఆ పెద్దావిడ వల్ల ఏమవుతుంది? రండి. కారున్నవాళ్ళెవరైనా త్వరగా పదండి. ప్రాణాపాయం కాకుండా చూద్దాం'' అఖిలను ప్రక్కకు జరిపి సిరిని భుజాన వేసుకున్నాడు ఒకాయన.

చుట్టూ మూగిన జనంలో ముగ్గురో, నలుగురో తప్ప ఎవరూ ముందుకు రాలేదు సహాయానికి. కొద్దిసేపట్లోనే సిరిని ఆసుపత్రిలో చేర్చి, ప్రాథమిక చికిత్స చేసి ప్రాణాపాయం తప్పించారు డాక్టర్లు.

పోయిన ప్రాణం తిరిగి వచ్చింది అఖిలకి ఆ మాట వినగానే.

తన మనమరాల్ని కాపాడి, సమయానికి ఆదుకున్న ముగ్గురికీ చేతులు జోడించింది, కన్నీళ్ళతో.



''అరెరె! పెద్దవారు. మీరు మాకు దండం పెట్టడమేమిటి? ఇంతకీ మీ అబ్బాయిగారు వాళ్ళు ఎక్కడికి వెళ్ళారో చెప్తే సమాచారం తెలియజేద్దాం. సెల్ నెంబరేమైనా వుందా'' ఒక వ్యక్తి అడిగాడు.

''నా దగ్గర ఏ ఇన్ఫర్మేషనూ లేదు. నిన్నగాక మొన్నే వచ్చాను కదా ఇక్కడికి. నాకూ కొత్తే. ఇంటి ఫోన్ నెంబర్ తప్ప మరింకేమీ నాదగ్గర లేదు. సిరికి స్పృహ వచ్చి మాట్లాడితే తప్ప తెలీదు'' నిస్సహాయంగా అంది అఖిల.

రాత్రి ఎనిమిదిన్నర ప్రాంతంలో ఇంటికి వచ్చి విషయం తెలుసుకున్న వేణు, వినీల ఆఘమేఘాల మీద పరుగులిడుతూ వచ్చారు ఆసుపత్రికి. ''ఎంతపనయిందే సిరీ! నేనెంత అదృష్టవంతురాలిని తల్లీ. ఎంత ఆపద నుంచీ గట్టెక్కావే. పైనున్న ఆ దేవుడు నాయందున్నాడు. లేకపోతే ఎంత ఘోరం జరిగేదమ్మా'' వెక్కిళ్ళు పెడుతూంది వినీల అప్పుడే స్పృహలోకి వచ్చిన కూతుర్ని కౌగిలించుకుని.

''ఆ దేవుడు కాదు మమ్మీ. నా వెంట వచ్చిన నానమ్మ, ఆ తర్వాత నన్ను హాస్పిటల్లో చేర్చి రక్షించిన ఆ అంకుల్స్, వాళ్ళకి చెప్పు థాంక్స్'' నెమ్మదిగా అంది సిరి.

అత్తగార్ని, ఆపదలో ఆదుకున్న ప్రక్కింటివాళ్ళని మార్చి మార్చి చూసింది వినీల. షేక్ హ్యాండ్ ఇచ్చి థాంక్స్ చెప్పాడు వేణు.

''చూశావా వినీలా! మాకెందుకులే అని వాళ్ళూ ఊరుకుని ఉంటే ఏమయ్యేది? నీ పిల్ల నీకు దక్కేదా? నన్నంటుకోకు నామాలకాకి అన్నట్లు వుంటే సమాజంలో సహజీవనం, ఎంత అసహజంగా వుంటుందో తెలుసుకో ఇప్పటికైనా'' ఈ మాటలు అఖిల తనని ఉద్దేశించి అంటున్నట్లు అన్పించింది వినీలకి.

నిజానికి అఖిలకి ఆ ఆలోచన రాలేదు. ఆ మాటలూ అనలేదు.

'తన మీద వదిలి వెళ్ళిన పిల్లని బాధ్యతారహితంగా వదిలేసింది అన్న నింద వచ్చేది ఏదైనా జరిగి వుంటే. పచ్చగా పదికాలాలపాటు బ్రతకాల్సిన పిల్ల జీవితం, బూడిదయిపోయిందే అని తాను జీవితాంతం కుమిలి కుమిలి పోయేది. ఆ పుణ్యాత్ముల దయ వలన పిల్ల గండం నుంచి బయటపడింది' ఇలా ఆలోచిస్తూంది ఆవిడ.

చెమ్మగిల్లిన కళ్ళతో అత్తగారిని హత్తుకుంది వినీల. బెడ్‌మీద నీరసంగా పడివున్న సిరిని ఓ చేత్తో, భయంగా అక్క వంక చూస్తున్న బంటీని ఒక చేత్తో పట్టుకుని కనిపించని దేవుడికి మనసులోనే మ్రొక్కుకున్నాడు వేణు.